BHARATH SAMACHAR DIGITAL

24, అక్టోబర్ 2026, శనివారం

భారత్ సమాచార్

# వ్యవసాయానికి నిరంతర విద్యుత్ ఇవ్వాలి: బీజేపీ



**భారత్ సమాచార్, మెదక్ జిల్లా**: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే విద్యుత్ కోతలు పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆరోపించారు. వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ ముందుచూపు లేకపోవడం, సరైన కార్యాచరణ రూపొందించకపోవడమే కారణమని రాధా మల్లేష్ గౌడ్ అన్నారు. ఎల్-నినో ప్రభావం ఉండే అవకాశాలపై ముందుగానే అవగాహన ఉన్నప్పటికీ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. ఫలితంగా సాగు పనులు కొనసాగించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు.

## సీఎం రాజీనామా చేయాలి

రాష్ట్రాన్ని సమర్థవంతంగా పాలించలేకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవికి రాజీనామా చేసి తప్పుకోవాలని రాధా మల్లేష్ గౌడ్ డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని విమర్శించారు. “ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం ఎప్పటికీ బాగుపడదు” అంటూ రైతుల సమస్యలపై ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. రైతుల ఆవేదనకు కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని వ్యాఖ్యానించారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టి సారించాలని సూచించారు.

## నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయ రంగానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని రాధా మల్లేష్ గౌడ్ డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే బీజేపీ రైతుల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు.

© 2026 Bharath Samachar